# అందని ఆకాశం

ఏడో నెంబరు బస్సు ఆగే స్టాండు దగ్గర స్తంభం మీద రెండు పిచికలు నిలిచాయి. స్తంభం పక్కన ఇద్దరు మనుషులు ఆగి ఉన్నారు.

స్తంభానికి దూరంగా ఓ మనిషి నిలబడ్డాడు, సైకిలు పక్కన సిగరెట్టు కాలుస్తూ.

పోలయ్య కిళ్ళీ షాపులోని సిలోన్ రేడియో సంగీతాన్ని పంచి పెడులోంది అందరికీ – అనాయాసంగా.

రెండు నల్లటి మేఘాలు బద్ధకంగా కదుల్తున్నాయి ఆకాశం మీద.

బస్సు రొదచేసుకుంటూ వచ్చింది. దిగారు. కాని ఆ నీలిరంగు బ్లౌజు, తెల్లటి వాయిలూ కట్టుకున్న అమ్మాయి మాత్రం స్తంభానికి చేరబడి అచేతనంగా అలాగే చేరబడి నిలబడింది. ఆ అమ్మాయిని చూస్తూ సైకిలు అబ్బాయి. అలానే బస్సులు వచ్చి పోతున్నాయి.

ఆమె కళ్ళు ఎదురుగ్గా పార్కుకి నడిరోడ్డులో ఎత్తుకి లేచి పడుతున్న నీటిధారలు వేపున్నాయి. సాయంకాలపు చల్లటిగాలి ఆమె శిరోజాల్ని చెదరగొట్టింది, ఒక పాయలేచి నుదుటిమీద అల్లలాడింది. సన్నగా, తెల్లగా – శిల్పి చెక్కిన విగ్రహంలా ఉన్న ఆమెనలానే చూస్తూ రెండు సార్లు చేతిని కాల్చుకున్నాడు సైకిలు కుర్రాడు సిగరెట్టుతో.

మునిమాపు వేళ వరకూ నిలబడి నిలబడి నిస్పృహ చెందిన అమ్మాయి వెనక్కి తిరిగి పోతూండగా, ఇంకా స్పృహరాని సైకిలు అబ్బాయి ఆమెను చూస్తూ అలాగే నిలబడ్డ సమయంలో దుమ్ము రేపుకుంటూ బస్సువచ్చి నిలబడింది. ఆకుపచ్చ రంగుమీద పసుపు గీతలున్న పదో నెంబరు బస్సు.

నల్లటోపీ పెట్టుకున్న సన్నటి కండక్టరు దిగుతూనే ఆ అమ్మాయిని ఏదో పలకరించాడు. పలకరించి చెయ్యి పట్టుకున్నాడు. మెల్లగా బస్సులోకి ఎక్కాక "రైట్" అనరిచాడు.

బస్సు కదిలింది – సైకిలు కుర్రాడి మనసులోని ఆందోళనతోపాటు.

బస్సు నడుస్తోంది. బస్సు వెనకనే ఆ కుర్రాడి సైకిలు అనేకమైన ఆలోచనలతో నడుస్తోంది.

సైకిలు బలహీనతల గురించి పోలీసు వెనకనుండి ఏవేవో అరుస్తున్నాడు. కాని కుర్రాడి బలహీనత మాత్రం పచ్చ బస్సులోని తెల్లచీరవేపే లాగుతోంది.

ఎన్నో రోడ్లు నడిచి, ఎన్నో చోట్ల ఆగి – చివరకి ఊరు చివరికి చేరింది బస్సు. అక్కడే సరిగ్గా ఆ తెల్లచీరె అమ్మాయి దిగిపోయింది. కుర్రాడిలో ఉత్సాహం, ఆతృతా, ఆమె ఎటుపోతుందీ అన్న సస్పెన్సూ.

ఇతన్ని గమనించలేదామె. చరచరా నడుచుకుపోతోంది రోడ్డు పక్కనుంచే. ఆ చుట్టుపక్కల కూడా జనసంచారం లేదు. చీకటిపడింది బాగా. అయినా భయం లేకుండా తన వెనక సైకిలు అబ్బాయి ఎవరో నడుస్తున్నారనే అనుమానమన్నా లేకుండా తెల్లచీరె అమ్మాయి అంత చీకటిలో నడిచి వెళ్ళిపోతోంది.

దూరం నుంచే గమనిస్తున్నాడు సైకిలు కుర్రాడు. ఆమె సరిగ్గా పన్నెండో ఎలక్ట్రీ స్తంభం పక్క కటకటాల యింట్లోకి వెళ్ళి తలుపు వేసుకుంది.

అతను వెనక్కి తిరిగాడు. అక్కడితో అతని కార్యక్రమాల్లో ఒకటి అయిపోయింది. సైకిలు ఎక్కాడు –

ఇది విష్కంబం.

* * * * *

ఆనాడు కుర్రాడు అసలు టైముకి ముందుగానే స్టాండుకి చేరుకున్నాడు. అమ్మాయి ఇంకా రాలేదు. పార్కులో పిల్లలు ఏదో గుజ్జనగూళ్ళు కట్తూ, పిచ్చి పిచ్చి ఆటలు ఆడుకొంటున్నారు. కుర్రాడి తలలో ఏవో ఆలోచనలు కదిలాయి.

తెల్లచీరె అమ్మాయి ఎందుకలా అంతసేపూ పార్కువేపు చూస్తూ నిలబడింది? తనవేపు ఒకసారన్నా ఎందుకని చూడలేదు? అన్ని బస్సులున్నా సరిగ్గా అదే బస్సుని కండక్టరు చెయ్యి పట్టుకునేదాకా ఎందుకు ఎక్కలేదామె? – ఆ కండక్టరుకీ, ఆమెకీ ఏం సంబంధం? – నిజానికి ఈ విషయం ఆలోచించడానికి ఆమెకూ, తనకూ ఏం సంబంధం? ఇలాంటి ఆలోచనలు అతన్ని తికమక పెట్తూండగా తెల్లటి చీరె అమ్మాయి – ఎర్రటి కెంపురంగు పల్చటి చీరె, ఆకుపచ్చటి బ్లౌజుతో అప్సరసలా వచ్చి నల్లటి ఏడో నెంబరు బస్సు స్తంభానికి చేరబడి నిలబడింది.

ఇప్పుడు ఆ స్తంభం మీద ఓ నల్లటి కాకి నిలబడి గొంతుక పగిలేట్టు అరుస్తూంది.

సైకిలు కుర్రాడు త్వరత్వరగా ఓ సిగరెట్టు వెలిగించాడు. నుదుటిమీద చెమటలు తుడుచుకొంటోంది అమ్మాయి. సైకిలు కుర్రాడు కదలడం మానేశాడు. సిగరెట్టు కాల్చడం మానేశాడు. అలఅలాగే ఆమె వేపు చూస్తున్నాడు. నిన్నటిలాగే బస్సులు వస్తున్నాయి – పోతున్నాయి.

నిన్నటి చివరిబస్సు ఇవాళ వేగంగా వచ్చింది.

వస్తూనే నల్లటి టోపీ పెట్టుకున్న కండక్టరు బస్సు దిగాడు. నిన్నటిలాగే ఆమె చేయి పట్టుకున్నాడు. సైకిలు కుర్రాడి మనస్సు జివ్వుమంది.

కండక్టరు ఆమెను బస్సులో ఎక్కిస్తున్నాడు.

తన వస్తువును లాక్కుపోతున్నట్టు బాధపడ్డాడు సైకిలు కుర్రాడు.

ఇవాళకూడా ఆమె అతనివేపు చూడలేదు.

ఎక్కి సీట్లో కూర్చుంది.

బస్సు కదిలిపోయింది.

బస్సు వెనక కుర్రాడి సైకిలు కదలలేదు.

కుర్రాడిలో మనస్సు కదిలింది.

మనస్సు ఆవేశాన్ని కదిపింది.

ఆవేశం చేతిని కదిపింది.

తర్వాత శరీరం కదిలింది.

దగ్గిర హెూటల్లో కూర్చొని ఓ కాగితం, కలం తీసుకుని – తనకు తోచిన భావాలన్నిటికీ రూపాన్నిచ్చి ఊరు చివర పన్నెండో స్తంభం పక్క కటకటాల యింటికి పోస్టు చేశాడు ఉత్తరాన్ని.

పోస్టుచేసి –

కాలువలో పడ్డ కుక్క వొళ్ళు దులుపుకొని లేచి కాలుజాడించి పారిపోయినట్టు, సైకులెక్కి సైడు రోడ్డు వెంబడే వెళ్ళిపోయాడు.

ఇది ప్రథమాధ్యాయం.

* * * * *

మూడురోజుల తర్వాతన్నా ఆమె నుంచి ఒక్క మాటా రాకపోయేసరకి కుర్రాడి చామనఛాయ ముఖం తెల్లనైంది. ఆ అమ్మాయి అలాగే పార్కులో నీటిధారలని చూస్తూంది. రోజూలాగే కుర్రాడి సైకిలు ఆగింది. అతని చేతిలో సిగరెట్టు రోజూలాగే కాలుతోంది. బస్సులు వస్తున్నాయి – పోతున్నాయి.

తన ఉత్తరానికి జవాబు రాకపోయేసరికి ఓ పక్క చిరాకు, మరోపక్క ఆశ్చర్యం, నిస్సహాయత – యిన్ని ఒక్కసారి అతని మనస్సులో కదులుతూండగా వాటన్నిటినీ ఆపుకోలేక ఓరోజు సాయంకాలం ఒంటరిగా ఆమె నిలబడ్డ సమయానికి దగ్గరికి వచ్చాడు. సిగరెట్టు దూరంగా పారేసి –

"ఏమండీ" అనబోయేంతలో పోలయ్య కిళ్లీషాపులో సోడా "కింయ్యి" మనేసరికి గుండె ఝల్లుమంది. వెనక్కి వెళ్ళిపోయాడు.

ఆ మర్నాడు మాట్లాడబోయేసరికి కాలిలో గాజుపెంకు దిగింది.

అటు తర్వాతరోజు దిక్కుమాలిన గజ్జికుంటి కుక్కపిల్లి ఒకటి బస్సుకిందపడి చచ్చిపోయింది.

అందుచేత అయిదురోజులు ఆగి హఠాత్తుగా ఆమెను కదిపాడు. ఆమె మొదట భయపడిపోయింది. తుళ్ళిపడింది. బెదిరింది. వెనక్కు జరిగింది. తర్వాత నల్లటి ఏడో నెంబరు స్తంభాన్ని పట్టుకు నిలబడి పోయింది. తర్వాత ఒక్కసారిగా కళ్ళుమూసుకు ఏడ్చింది. బిత్తర పోయాడు కుర్రాడు.

"నేను మీకు కనిపించానా?" అంది కాస్సేపటికి.

"ఉత్తరం విషయమా?" అన్నాడు

"నేను చూడలేదు. కాని తమ్ముడు చదవగా విన్నాను."

"అదేం?"

"నేను చదవలేదు"

పాపం! చదువురాదు కాబోలు అనుకున్నాడు.

"తప్పుచేశానా?" అని అడిగాడు.

"నా సంగతంతా తెలిస్తే మీరావుత్తరంలో రాసిన మాటలు అని ఉండరు."

"చాలా వరకూ తెలుసు"

"చాలా తెలీదు మీకు"

"ఏమిటి తెలియాలి"

ఆమెవేపు చూశాడతను.

వారిజనేత్రి అంటే బావుంటుందా, నీలలోచని అంటే బావుంటుందా అని ఆలోచిస్తున్నాడు.

ఇంతలో అతని తలమీద ఓ పిడుగు పడింది.

"చూడలేన్నేను."

తుళ్ళిబడ్డాడతను.

అతని మనస్సులో ఏదో యుద్ధం జరుగుతోంది.

కళ్ళు తనకి తెలీకుండానే తడిబారాయి. ఇతని మనస్సులో ఎటువంటి పరివర్తనలు కలుగుతున్నాయో ఊహించుకుని బాధతో, సిగ్గుతో రెపరెపలాడిపోయిందామె.

ఎప్పుడు బస్సు వచ్చిందో అతనికి తెలీదు. అతను చూసేసరికి వెళ్ళిపోయింది. పోలయ్య కిళ్ళీకొట్టు మూసేశాడు. ఓ కుక్క ఎంగిలాకులో మెతుకులు కతుకుతోంది.

తన పాతసైకిలు తనవేపు చూసి నవ్వుతోంది.

ఏదో సుషుప్తిలోంచి మేలుకున్నవాడిలా అయ్యాడు.

సైకిలు యెక్కాడు. సైకిలు నడుస్తోంది. అతనితోపాటు అతని ఆలోచనలూను.

* * * **

ఐదురోజుల తరువాత ఓనాటి సాయంకాలం సైకిలు కుర్రాడు సావధానంగా ఆమె దగ్గరికి వచ్చాడు.

"అంతా ఆలోచించాను – నిమ్మల్ని పెళ్ళిచేసుకుంటాను" అన్నాడు.

ఆమె తుళ్ళిపడింది. ఎంతసేపటివరకో తికమకపడింది. ఏదో గుణుక్కుంది. తర్వాత అంది – అంతే.

* * * * *

ఏడో నెంబరు బస్సు ఆగే బస్సుస్టాండు దగ్గర నల్లటి స్తంభం విరిగి పోయిందిప్పుడు.

స్తంభం మీద పిచ్చికలు నిలబడడంలేదు.

పార్కులో నీటిధారలు ఆగిపోయాయి. పిల్లలు ఆడడంలేదు.

సైకిలు కుర్రాడు రావడంలేదు.

కారణం –

వాళ్ళిద్దరికీ పెళ్ళయిపోయింది – !

* * * * *

ఒకే ఒక సంఘటన మలచిన రెండు జీవితాలు అతి రహస్యంగా అతుక్కుపోయాయి. ఆమె సౌహార్ధం, అందం అతన్ని ఆకర్షించాయి. అతని విశాలత్వం, హృదయం ఆమెను ఆకర్షించింది.

ఈ ఆకర్షణల ఫలితం ఆరేళ్ళ తర్వాత పుట్టిన అబ్బాయి –

ఈమెలో అందాన్ని, సౌహార్ధాన్నీ, అతనిలో విశాలత్వాన్నీ, దయనీ పుణికి పుచ్చుకు పుట్టాడు.

ముఖ్యంగా ఆమెకు లోపించిన కళ్ళ మెరుపులు ఆ అబ్బాయి కళ్ళలో రెట్టింపయాయి. ఆ కళ్ళు చాలు మనచేత ఏ పనన్నా చేయించడానికి. కళ్ళలో అంత శక్తి, ఉండగలదని తెలీదువాళ్ళిద్దరికీ అంతకు ముందు.

రోజులు గడిచిపోయాయి.

కాలంతోపాటు కథలూ మారాయి. కొత్తవి పాతా, పాతవి కొత్తా అయాయి.

కుర్రాడు పెద్దవాడయ్యాడు. పెళ్ళయింది. మూడేళ్ళ తరవాత అతనికో కూతురు పుట్టింది. ఆమె ఆనందానికి అవధుల్లేకుండా పోయింది.

కాని ఆశ్చర్యం ఏమిటంటే –

కళ్ళు మాత్రం కనిపించవు!

పార్కులో నీటిధారలు కనుపించవు.

ఆకాశంలో నీలినీడలు కనుపించవు.

ఆమె అందం ఆమెకు కనిపించదు.

ఆమె అందం ఆమెకు లేదు.

ఆమెకు ఆనందం లేదు.

ఆమెకు ప్రపంచమే లేదు!.